క్లుప్తంగా

బీఆర్ఎస్ సీనియర్ నేత మృతి



నవీపేట: నవీపేట గ్రామ పెద్దగా పేరుగాంచిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఈఎం గంగాధర్(85) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శాంతి కమిటీ ప్రతినిధి, మహోదయ క్లబ్ మెంబర్‌గా ఆయన పలు సేవలందించారు. గంగాధర్ భార్య, కుమారులను కోల్పోయి చివరి గడియల్లో అవస్థలు పడ్డారు. అంత్యక్రియలకు మహోదయ క్లబ్ ప్రతినిధులు సాయరెడ్డి, సాయిబాబగౌడ్, డాంగె శ్రీనివాస్‌లు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావ్, జిల్లా నాయకులు బీడీ దాస్, గిర్దావర్ గంగారెడ్డి, నర్సింగ్‌రావ్, తెడ్డు పోశెట్టిలు సంతాపం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం, తాడ్‌బిలోలి, రెంజల్ గ్రామాల్లో దరఖాస్తుదారులకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ద్వారా బాధితులకు తక్కువ సమయంలో ఆర్థిక సాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, విండో చైర్మన్ మొయినొద్దీన్, నాయకులు సాయరెడ్డి, ధనుంజయ్, కార్తీక్, కుర్మె శ్రీనివాస్, ఇందిరారెడ్డి, శ్రీకాంత్, సాయిలు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఎడపల్లి(బోధన్): ఇందిరమ్మ ఇళ్ల పైలట్ గ్రామంగా ఎంపికైన జైతాపూర్‌లో ఇళ్ల నిర్మాణ పురోగతిపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ శాఖ ఏఈ నీవార్తి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ గ్రామంలో 128 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా 16 మంది మాత్రమే ఇండ్ల నిర్మాణం చేపట్టారు. ఇళ్ల నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్ లెవల్ పూర్తయినా బిల్లులు రాలేదని, మిగితా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని కాంగ్రెస్ నేతలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. లబ్ధిదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ నారాయణ, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్ ఆందోళన



రెంజల్(బోధన్): భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ సిద్ధమైందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం సవరించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ సైనికులు ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. మండలంలోని తాడ్‌బిలోలి, రెంజల్, సాటాపూర్, బోర్గాం గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడ్‌బిలోలిలో జరిగిన ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. వెనుకబడిన వారికి సమాన హక్కులు కల్పించాలన్నదే కాంగ్రెస్ సిద్ధాంతమన్నారు. అంతకు ముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మండల నాయకులు నాగభూషణంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయకూర్‌లో పాదయాత్ర

రుద్రూర్: రాయకూర్, రాయకూర్ క్యాంపు, సులేమన్‌నగర్‌లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నితిన్ పటేల్, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బొంకన్‌పల్లి ఎత్తిపోతలు నిలిచిన పనులు

- పత్తా లేని కాంట్రాక్టర్
- బిల్లులు చెల్లించకపోవడమే కారణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న పంప్ హౌజ్ నిర్మాణం

మాక్లూర్ : గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకుని ధర్మోరా చెరువు లక్మాపూర్ వద్ద నిర్మించ తలపెట్టిన బొంకన్‌పల్లి ఎత్తిపోతల పనులు నిలిచిపోయి సంవత్సరం గడుస్తోంది. తిరిగి ఆ పనులు ప్రారంభం కాకపోవటంతో ముల్లంగి (బి), బొంకన్‌పల్లి గ్రామాల రైతులు నిరాశ చెందుతున్నారు. పనులు ప్రారంభించిన సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు, అధికారులు మాట తప్పారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవటంలో ఆంతర్యమేమిటో అర్థం కావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొంకన్‌పల్లి, ముల్లంగి (బి) గ్రామాల రైతుల కోసం అప్పటి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సీఎం కేసీఆర్‌కు విన్నవించి రూ.11.70 కోట్లను మంజూరు చేయించారు. పంప్ హౌజ్ వద్ద బేస్‌మెంట్ లెవల్ వరకు, పైప్‌లైన్ రాంపూర్ వరకు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ జాడలేదు. పనులు జరగటం లేదు. ఈ విషయమై రైతులు, ప్రజాప్రతినిధులను తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి అందుబాటులోనికి తేవాలని రైతులు కోరుతున్నారు.

మరో 500 ఎకరాలు సాగులోకి..

ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పినట్లు 2024 సెప్టెంబర్ నాటికి మినీ లిఫ్ట్ పూర్తయి ఉంటే ఈ యాసంగిలో రెండు గ్రామాలకు కలిపి మరో 500 ఎకరాలు సాగు చేసుకునే అవకాశం ఉండేది. కాని సంవత్సరకాలంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి సకాలంలో బొంకన్‌పల్లి మినీ లిఫ్ట్‌ను పూర్తి చేయించాలి. – పీసరి శ్రీనువాస్, రైతు, బొంకన్‌పల్లి, మాక్లూర్

బిల్లుల చెల్లింపు వల్లే జాప్యం

సకాలంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం వల్లే బొంకన్‌పల్లి మినీ లిఫ్ట్ పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు బిల్లులు వచ్చాయి. జూన్ నాటికి ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తాం.

–కృష్ణమూర్తి, ఇరిగేషన్ డీఈ, ఆర్మూర్



బొంకన్‌పల్లి వద్ద ఉన్న లిఫ్ట్‌కు సంబంధించిన పైపులు

ఈవ్ టీజింగ్ చేస్తే సమాచారం ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న కానిస్టేబుళ్లు, ఎంఈవో

కమ్మర్‌పల్లి : ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా షీ టీంకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ సబ్ డివిజనల్ షీ టీం కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి అన్నారు. మంగళవారం చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు గురైన వారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పించడంతో పాటు, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. షీ టీం కాంటాక్ట్ నెంబర్ 8712659795కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఎంఈవో ఆంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం



ఏడీఈ, ఏఈలను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం మగ్గిడి, అమ్దాపూర్ గ్రామాల్లో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఏడీఈ శ్రీనివాస్, ఏఈ మౌనిక మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. లో వోల్టేజీ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతగా ఏడీఈ, ఏఈలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, లైన్‌మెన్లు ప్రవీణ్, రాజన్న, ఏఎల్ఎం సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సైన్స్ ప్రయోగ పరికరాల అందజేత



సైన్సు పరికరాలతో ఎంఈవో, విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి మంగళవారం రూ.50 వేల విలువ గల సైన్సు పరికరాలను అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలకు విరాళాలను అందజేస్తున్న ఏనుగు దయానంద్ రెడ్డికి పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్టీయూ నాయకులు అశ్వాక్ అహ్మద్, ఉపాధ్యాయులు గణేష్, శ్రీకాంత్, రాజేష్, సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర



వీరన్నగుట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రెంజల్(బోధన్): వీరన్నగుట్టలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకుడు, తండా మాజీ సర్పంచ్ జాదవ్ గణేశ్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో ఈ కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ అందిందని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, మాజీ సర్పంచ్ వినోద్, రైతులు బుడ్డు, మహేశ్, రాంచందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : అమ్రాద్ సొసైటీ పరిధిలోగల ముత్యంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రత్యేక అధికారి ముత్తెన్న ప్రారంభించారు. స్థానిక మహిళా సంఘం నిర్వహించే కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో టి.శ్రీనివాస్, ఏపీఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



వేల్పూర్: రామన్నపేట్‌లో సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో శృతి మంగళవారం తనిఖీ చేశారు. వరి కొనుగోలు సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేమ శాతం 17 మించకుండా చూడాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. అనంతరం మోతె గ్రామంలో వరి కోత కోసే విధానాన్ని పరిశీలించారు. వరిచేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే పంట కోయాలని, కోత మిషన్ ఉపయోగించేటప్పుడు బ్లోయర్ ఆన్‌లో ఉంచాలని, కోత మిషన్ ఆర్‌పీఎం 18 ఉండాలని పేర్కొన్నారు. ఏఈవో షబ్బీర్, సొసైటీ సీఈవో రణవీర్, సెంటర్ ఇన్‌చార్జి సురేందర్ ఉన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రుద్రూర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోటగిరి రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కోటగిరి తహసీల్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో క్వింటాలుకు కిలో తరుగు తీశారని, ప్రస్తుతం రెండున్నర కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతులు ఏముల నవీన్, మామిడి శ్రీనివాస్, పాకాల సాయిలు, గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడిలోనే చదివించండి



కొత్తపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



రామన్నపేట్‌లో బడిబాట

బాల్కొండ: సర్కార్ బడిలోనే చదివించండి అంటూ మంగళవారం ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేసే చోటకు వెళ్లి ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రఘు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేల్పూర్: రామన్నపేట్‌లో జిల్లా పరిషత్తు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఒకటి, రెండో వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన ఆధునిక విద్యా సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, డ్రెస్సులు అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు చెప్పారు. గ్రామంలోని విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. హెచ్‌ఎంలు శివాజీ, నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటగిరిలో 'విద్యుత్' పరిష్కార వేదిక



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఫోరం సభ్యులు, అధికారులు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు వేచి ఉన్నా ఫిర్యాదులేమీ రాలేదు. ఏవైనా విద్యుత్ సమస్యలుంటే 1912కు సమాచారం అందిస్తే పరిష్కరిస్తామని వివరించారు. సీజీఆర్ఎఫ్–2 చైర్మన్ నారాయణ, సభ్యులు కిషన్, రాజాగౌడ్, ట్రాన్స్ డివిజనల్ ఇంజినీర్ ఎండీ ముక్తార్, ఏడీఈ నగేశ్ కుమార్, ఏవో శివాజీ గణేష్, ఏఈలు పాల్గొన్నారు.

విజయయాత్ర శాంతియుతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్(బోధన్): హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్ పట్టణంలోని నిర్వహించే వీరహనుమాన్ విజయ యాత్ర ర్యాలీని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాత్రి వీర హనుమాన్ విజయ యాత్ర కమిటీ సభ్యులతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఊరేగింపులో డీజే సౌండ్ సిస్టమ్ వాడొద్దని, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని, పుకార్లను నమ్మరాదని సూచించారు. సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తి పాటలకు నృత్యాలు చేశారు. శోభాయాత్ర దోబీఘాట్ నుంచి ఆలూర్ చౌరస్తా, కింది బజార్, పాతబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరిగి జ్యోతిర్లింగం ఆశ్రమం వరకు నిర్వహించారు.

కొండగట్టుకు పాదయాత్ర



రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన హన్మాన్ మాలధారణ స్వాములు శ్యాం, చంటి, శ్రీను, మనుదీప్, నరేందర్ మంగళవారం రుద్రూర్ నుంచి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి కాలినడకన బయలు దేరారు. అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా బయలు దేరారు. మండలంలోని స్వాములు గ్రామ శివారు వరకు వచ్చి పంపించారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

రుద్రూర్: పొతంగల్ మండలంలోని కొడిచర్లలో ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన 21 మంది రైతులకు ఖాతాల్లో నగదు జమైనట్టు ఐకేపీ ఏపీఎం బస్వంత్ రావ్ తెలిపారు. నాలుగు రోజులకు సంబంధించి రూ.24లక్షల10 వేల 944లు వచ్చాయని వివరించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలకు తొలి విడత డబ్బులు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఖాతాలో ధాన్యం డబ్బులు జమ కావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సయ్యద్ ఖాద్రి దర్గా ఉత్సవాలు



బాల్కొండ: మండల కేంద్రంలో మంగళవారం సయ్యద్ షా బాద్‌షా ఖాద్రి దర్గా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మదర్ సా నుంచి ఊరేగింపుగా సందాలు తీసుకెళ్లారు. ర్యా లీలో ఫకీర్‌లు చేసిన విన్యాసాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొని విజయవంతం చేశారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన లింగం ఇటీవలే మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి 'మీ కోసం మేము' అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు గంగాధర్, ఆకుల రాజన్న, రమేశ్, శేషాద్రి, సాగర్, ప్రదీప్, హేమంత్, నవీన్, గంగాధర్, నిశాంత్, సర్జన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరం



బోధన్: పట్టణ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ ఎక్చేంజ్ ఆఫీస్ ఎదుట మంగళవారం వినియోగదారుల సేవా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. బీఎస్ఎన్ఎల్ బోధన్ సబ్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్ చారి, జేటీవోలు ఉదయ్ కుమార్, సాయిలు, నవీన్‌లు బీఎస్ఎన్ఎల్ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగదారులకు వివరించారు. నెట్‌వర్క్ సిగ్నల్ సమస్యలను పరిష్కరించామని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో శిబిరాలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 వృషభ-10.30, ఎల్‌వైఎఫ్-1.40, 28సీ-7.55, కోర్ట్-4.45, 10.25

స్క్రీన్-2 సికిందర్ (హిందీ) - 10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్-4.00

స్క్రీన్-3 మ్యాడ్ స్క్వేర్-11.20, 2.05, 4.50, 7.35, 10.20

స్క్రీన్-4 కోర్ట్-10.10, రాబిన్‌హుడ్-1.15, 10.20 శారీ-4.25, ఆదిత్య369-7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్